


# "మా బా బు"

"అబ్బీ! రిక్షా త్వరగా పోనీయి"

"..........."

"ఇంకా త్వరగా ,..."

"..........."

"బాగా పరుగెత్తాలి. గుఱ్ఱంకంటె వేగంగా పోవాలి"

"ఇంకా ఎల్లాగ బాబూ. ఆయాసంతో చచ్చి పోతున్నా"అని దీనముగా చూచాడు నల్లటి కండలు తిరిగిన శరీరములోనుంచి ముచ్చెమటలు ముత్యాల లాగ రాలుతున్నాయి. వాటినొక చేత్తో తుడుచుకొంటున్నాడు. కాని స్వేదజల ప్రవాహము ఆగలేదు. "ఉస్సు" మనుకుంటూ పరుగెత్తుచునే ఉన్నాడు. రొప్పటంకూడ మొదలెట్టాడు. కాని ఇంకా పరుగెత్తుట ఆపలేదు. ముందునుంచి వచ్చే మనుష్యులను కారులను తప్పిస్తున్నాడు. మధ్యమధ్య వెనుకకుతిరిగి దారిస్తున్నాడు. ఎంత నేర్పు, ఎంత చాతుర్యము. ఇన్ని చేస్తున్నా వేగము మటుకు తగ్గించలేదు.

రిక్షావాడివంక తదేకదృష్టితో చూస్తున్నాడు మాబాబు. వాడి కాకీనిక్కరు, నెత్తినకొంచెము చిరిగిన "ఈవెనింగుహేటు" సగమువరకు చిరిగిపోయిన గోధుమరంగు "కాన్వాసుబూటు" మావాడి దృష్టి నాకర్షించాయి. నల్లటి శరీరమునుండి బయల్వెడలిన స్వేదబిందువులమీద సూర్యకిరణాలు స్వేచ్ఛగా పడి మెరుస్తున్నాయి.

"అన్నా. వాడికి ఎండలేదూ..."

"మనందఱకు మటుకులేదూ ఎండ"

"ఎంత చెమటపోస్తోందో నాచొక్కాతో తుడవనా"అని నావంక చూచాడు బాబు.

"తప్పు అల్లా అనగూడదు. వాడికి అలవాటే, అందుకని ఫరవాలేదు" అని కొంచెము విసుగ్గా జవాబు చెప్పాను. మాబాబు నాముఖమువైపు మళ్లా జాలిగా చూడసాగాడు.

ఇంతట్లోకే బీచి సమీపానికి చేరాము. సాగరము పైనుండి వచ్చుచున్న చల్లటిగాలి దేహాన్ని మైమరచేటట్టు చేస్తోంది. మేమంతా రిక్షానుంచి దిగాంకాని మాబాబు భీష్మించుకుని కూర్చున్నాడు. దిగమంటే దిగడు.

"మీరు వెళ్లిరండి చెరువుకు... నేనిక్కడే ఉంటా నాకిక్కడే బాగుంది" అని రిక్షాలో కూర్చునిపోయాడు. మా బాబుకు రిక్షా ఎక్కుట అదియే ప్రథమ పర్యాయము. అందువలన తమాషాగా ఉండేమో ననుకున్నాం. కాని సముద్రమునకు వచ్చుట కూడా ప్రథమదఫాయే కాని సముద్రముకంటె మావాణ్ణి రిక్షాయే ఎక్కువ ఆకర్షించినట్టుంది.

శ్రీ కిళాంబి కృష్ణమాచార్య.

"మోటార్లు వస్తాయి. క్రిందకుదిగకు" అని మేము యిసుకనేలలో నడుచుట ప్రారంభించాము.

* * *

"అబ్బీ, నీకు చొక్కా లేకపోతే ఎండగాదూ."

"డబ్బులేదు కదండి కొనుక్కోటానికి"

"మరి నాదగ్గర అణావుంది. వాన్ని పెట్టి కొనుక్కో"

"వద్దండి బాబూ. నాకు ఇల్లాగే బాగుంది"

"వాన వస్తేనో, గొడుగులేదూ నీకు? వానలో పరుగెత్తితే క్రిందపడవూ చలివేయదూ..." అని ప్రశ్న పరంపర వేయ మొదలెట్టాడు. కాని రిక్షావాడుమాత్రం విసుగులేకుండా చిరునవ్వుతో జవాబులు చెప్తున్నాడు మా బాబువేసే ప్రశ్న లన్నింటికిని.

"బాబుగారూ......"

"అబ్బీ నా పేరెట్లా తెలుసు నీకు"

"తెలియదండీ బాబూ,- ఊరికెనే అల్లా పిలిచాను. మీరు వెళ్లి సముద్రముచూడరూ."

"నీవుకూడా నాతోవస్తే..."

"సరే"నని మా బాబును చంకనేసుకొని బయలుదేరాడు. దారి పొడుగునా ఏదో మాట్లాడుతుంటూనే వున్నారు. మావాడు అడిగే ప్రశ్న లన్నింటికిని విసుగు విరామములేకుండా, సమాధానము చెప్తుతున్నాడు. మేడలను పడవలను, సముద్రపు కెరటాలను అన్నింటినిగూర్చి తనకు తెలిసినంతవరకు మా బాబుకు తెలియపరుస్తున్నాడు.

ఇంతలో మమ్ములను వచ్చి కలుసుకున్నారు.

ఇంకా మా బాబును చంక నేసుకొని నడుస్తున్నాడు. ఇంత త్వరలో ఎల్లా మాలిమిపడ్డాడా అని ఆశ్చర్యమేసింది. మావాణ్ని చూస్తే అతని కెందుకా అంత ఆపేక్షయని ఆలోచించ సాగాను. ఒడ్డుకు కొట్టుకుంటున్న అలలలోదిగి వాళ్ళిద్దరు ఆడుకుంటున్నారు. చీకటి పడుతోంది బయలుదేరుదామా అన్నాను. సరే అని మళ్లా బాబుని చంకనేసుకున్నాడు.

* * *

తెల్లవార్లూ మాబాబు ఒకటే కలవరించటం మొదలెట్టాడు.

"అన్నా రిక్షావాడికొక చొక్కా యివ్వవూ" అని మాటిమాటికీ లేచి కూర్చుండేవాడు. మావాడి లేతహృదయమునందు కరుణ నాటుకుపోయిందని అప్పు డూహించుకొన గలిగాను.

రిక్షావాడు రోజు సాయంత్రమగుసరికి మా యింటిముందర హాజరయ్యేవాడు. అతనికి ఇల్లూ, వాకిలి ఏమీ ఉన్నట్లులేదు. రోజుల్లా కష్టించిసంపాదించిన కొద్దిడబ్బుతో భుజించి రిక్షాలోనే పడుకునేవాడు. తక్కిన వేళలయందు ఎక్కడతిరిగినా, సాయంకాలమగుసరికి రిక్షాతో తయారయ్యేవాడు. కొన్నికొన్ని రోజులు రిక్షా వాకిట్లో దింపుకుని మాబాబుతో ప్రొద్దుపోయినదాకా కాలము గడిపేవాడు. అతని చర్య చూస్తే చాలా వింతగా కన్పడేది.

రాత్రి షుమారు 9 గంటలు కావస్తోంది. సుధాకరుడు కిలకిలా నవ్వుతున్నాడు. సముద్రపు ఘోష స్ఫుటముగా వినుపిస్తోంది. వాకిటముందర మాలతీ పందిరక్రింద మాబాబు చల్లగాలిలో హాయిగా నిద్ర పోతున్నాడు. సంపంగి తన సౌరభములను వెదచల్లుతోంది.

"ఇదుగో, త్వరగా ఇల్లా ఒకమారు రావాలి"

"ఆ ఎందుకు ఇప్పుడేగా చెయ్యి కడుక్కొని ఇవతలకొచ్చింది. ఇంతలోనే అంత బెంగ ఎందుకు"

"కాదు అకటావికటం తర్వాతగాని త్వరగా రావాలి."

"ఏదో మునిగిపోయినట్లు అంత ఆదుర్దా ఎందుకు ఏమిటో చెప్పకాదూ"

మాలతి పందిరివద్దకు వెళ్లిచూచాను. మా బాబు సుఖంగా నిద్రపోతున్నాడు. కాని రిక్షాఅతనుమాత్రం విసురుతూ కూర్చున్నాడు మా బాబువంక దీర్ఘంగా చూస్తూ. నేత్రములనుండి నీరు జల జల రాలుతున్నాయి.

నే నతని పిలుచుటవలన ఉలిక్కిపడి లేచాడు అతని వింతచర్యకు కారణము తెలిసికొన వలెనని ఆ రోజు కృతనిశ్చయుడ నైనాను.

"నిన్నేదో మనసులో ఎక్కువగా బాధిస్తున్నట్లుంది. ఈదినము తప్పకుండా చెప్పి తీరవలసినదే"నని బలవంత పెట్టాను.

మొదట చెప్పటకు కొంచెము సంకోచించాడు. కాని కన్నీరు తుడుచుకుంటూ ఈ విధంగా చెప్పసాగాడు.

"చిన్నప్పుడు నాకో తమ్ము డుండేవాడు. మాది కేవలం బీదసంసారం అగుటవలన మా తండ్రికి పోషించటం చాల కష్టమయ్యేది. కొన్ని కొన్ని రోజులు సహితము క్షుద్బాధకు ఆగలేక గిలగిలా కొట్టుకుపొయ్యే వాళ్ళం. కొన్నిరోజులకు మావూరికొక మిషను దొర వచ్చాడు. మా అవస్తచూచి జాలిపడ్డట్లు కనుపించాడు. మాతమ్ముణ్ణి పదిరూపాయలకు కొని తీసుకు వెళ్లిపోయాడు. దొర వెంట వెళ్లునరికి మావాడు కూడ బాబుగారంత ఉండేవాడు......" అని ఇంకా ఏమోమో చెప్పబోయి గిర్రునతిరిగి వెళ్ళిపోయాడు. బైటికిపోయి చూచుసరికి చీకటిలో అదృశ్యమైనాడు.

# సాక్ష్యములు

సీ॥ సాధుసజ్జనులని సంతసించుటకునై,
కాషాయవస్త్రముల్ గట్టిసాక్షి,
ఘనమైన యాపెద్ద, మునులువీకనుటకు.
చేతిలోనున్నట్టి చిలుముసాక్షి,
సురపానమును జేయు, సురలు వీరనుటకు,
చంకలో సారాయిసీస సాక్షి,
కూరులమంచును, సూచించుటకునై,
ఎత్తికట్టిన పొట్టి పట్టు సాక్షి,
గీ॥ నిత్యమానందమును జెంద, నీచమైన,
వారకాంతలు వసియించు వసతెసాక్షి.
అకట యేమందు నీకాల నరుల నిపుడు,
సచ్చిదానంద, సర్వాత్మ, సారసాక్ష.

—సిరిపురపు ఆదినారాయణ మూర్తి.